సాక్షి
అనంతపురం

సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



లైనింగ్ పనులతో తీరని నష్టం

హంద్రీ-నీవాలో లైనింగ్ పనులతో తీరని నష్టం వాటిల్లుతుందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం

37.9°/17.6°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తీవ్రత తగ్గింది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 11వ పీఆర్సీ కమిటీని ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగులకు ఐఆర్ 40 శాతంతో పాటు కరువు భత్యం విడుదల చేయాలన్నారు. జీపీఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీగా ఎన్నికైన ముక్తియార్ అహ్మద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు కుళ్లాయప్ప, గౌస్‌పీరా, జిల్లా కార్యదర్శి పెద్దన్న, నాయకులు మహబూబ్‌బాషా, జయచంద్ర, షెక్షావలి, ప్రకాష్, నాగభూషణం, కిరణ్ కుమార్, మహేష్, స్వర్ణలత, ఆదిలక్ష్మి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

టమాట మార్కెట్‌ను పరిశీలించిన జేసీ



టమాట ధరలను తెలుసుకుంటున్న జేసీ

అనంతపురం సెంట్రల్: రూరల్ మండల పరిధిలోని కక్కలపల్లి టమాట మార్కెట్‌ను ఆదివారం జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పరిశీలించారు. మార్కెట్‌లో పలుకుతున్న ధరలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నష్టం కలగకుండా రేట్లు నిర్ణయించాలని విక్రయదారులకు సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ డీడీ నరసింహారావు, రాప్తాడు మార్కెట్‌యార్డు సెక్రటరీ రామ్ ప్రసాద్, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విషపు నీరు తాగి గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

బ్రహ్మసముద్రం: విషతుల్యమైన నీటిని తాగి 29 గొర్రెలు మృతిచెందాయి. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం భైరవానితిప్ప గ్రామానికి చెందిన కాపరులు బొమ్మన్న, రామాంజనేయులు, కోళ్ల తిప్పేస్వామి... గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నారు. ఆదివారం గ్రామ సమీపంలోని పొలాల్లో గొర్రెలను మేపునకు వదిలారు. ఈ క్రమంలో మధ్యాహ్నం పొలాల్లోని నీటిని గొర్రెలు తాగాయి. అయితే అప్పటికే పంటలకు పిచికారీ చేసేందుకు ఆ నీటిలో యూరియా కలిపిన విషయాన్ని కాపరులు గుర్తించలేదు. కాసేపటి తర్వాత ఒకదాని వెనుక ఒకటి గొర్రెలు మృత్యువాత పడుతుండడంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న మండల పశు వైద్యాధికారి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే బొమ్మన్నకు చెందిన 9, రామాంజినేయులుకు చెందిన 12, కోళ్ల తిప్పేస్వామికి చెందిన 8 గొర్రెలు మృతి చెందాయి. అస్వస్థతకు గురైన మరో 15 గొర్రెలకు వైద్యాధికారి చికిత్స అందజేశారు.

దంపతులపై దాడి



గాయపడిన నరసింహులు, లక్ష్మి

గుత్తి రూరల్: మండలంలోని గొందిపల్లిలో దంపతులపై దాడి జరిగింది. బాధితులు తెలిపిన మేరకు..గ్రామానికి చెందిన నాగరాజు, లక్ష్మి అదే గ్రామానికి చెందిన నరసింహులు, లక్ష్మి దంపతుల ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. అయితే ఇంటి పక్కన చెత్త వేశారనే అంశంపై శనివారం గ్రామంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. దీనిపై ఓ వర్గం పోలీసులను ఆశ్రయించడంతో స్టేషన్‌కు నరసింహులు, లక్ష్మి దంపతులను పిలిపించి విచారించారు. ఆదివారం మరోసారి ఇరువర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. నరసింహులు, లక్ష్మి దంపతులపై కరుణశేఖర్, కొత్తపేటకు చెందిన నాగరాజు, లక్ష్మి దాడి చేసి గాయపరిచారు. దంపతులను కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఇంధనం కొట్టేసి!

ఇటీవల చాలా రకాల మోసాలు వెలుగుచూస్తున్నాయి. సామాన్యుల జీతాలు, జీవితాలు అంతంతమాత్రంగానే ఉంటే.. వారి జేబులకే కన్నం వేస్తున్నారు కొందరు కేటుగాళ్లు. నిత్యావసర సరుకుల నుంచి చిన్న పిల్లలు తినే చాక్లెట్ల వరకూ ప్రతిదాంట్లోనూ మోసాలతో ప్రజలు కుదేలవుతున్నారు. ఇలాంటి తరుణంలోనే పెట్రోల్ బంకుల్లోనూ డీలర్లు మోసాలకు తెరలేపారు. ఉమ్మడి జిల్లాలో ఈ తరహా మోసాలు చోటు చేసుకోవడం సంచలనం రేకెత్తిస్తోంది.



ట్యాంపరింగ్ చిప్ అమర్చిన ఫిల్లింగ్ యంత్రం ఇదే

- పెట్రోల్ బంకుల్లో బయట పడుతున్న ఘరానా మోసాలు
- చిప్‌లు అమర్చి తక్కువ ఇంధనం కొడుతున్న డీలర్లు
- నాసిల్స్ అప్‌డేట్ చేయట్లేదని గుర్తించిన అధికారులు

అనంతపురం: వినియోగదారులను కొందరు పెట్రో ఉత్పత్తుల డీలర్లు మోసం చేస్తున్నారు. పెట్రోల్ పోసే యంత్రాల్లో మైక్రో చిప్‌లు అమర్చి వాహనదారులను బురిడీ కొట్టించిన వైనం ఇటీవల అనంతపురం నగరంలో వెలుగు చూసింది. మానవ ప్రమేయ మోసాలకు అడ్డుకట్ట వేస్తూ ఎలక్ట్రానిక్, డిజిటల్ ఫిల్లింగ్ డిస్పెన్సరీ యూనిట్లు అందుబాటులోకి వచ్చినా... ఆధునిక సాంకేతికతను అడ్డు పెట్టుకుని ఊహకు అందని సరికొత్త మోసాలు అదే స్థాయిలో వెలుగు చూస్తున్నాయి. మొన్నటికి మొన్న అనంతపురం నగర శివారులోని సోములదొడ్డి వద్ద ఉన్న విజయలక్ష్మి (ఇండేన్) పెట్రోల్ బంకులో చిప్ అమర్చి మీటర్ రీడింగ్‌ను ట్యాంపరింగ్ చేస్తున్న యాజమాన్యం మోసాలను విజిలెన్స్ అధికారులు బహిర్గతం చేశారు. ఏడాదిలో 28 లక్షల లీటర్ల డీజిల్ అమ్మకం సాగించగా.. ఇందులో 2.80 లక్షల లీటర్ల డీజిల్‌ను వినియోగదారులకు వేయకుండానే గుట్టుచప్పుడు కాకుండా నొక్కేసిన వైనం బహిర్గతమైంది. ప్రస్తుతం మార్కెట్లో లీటర్ డీజిల్ రూ.97కు పైగానే విక్రయిస్తున్నారు. సరాసరి రూ.97తో లెక్కించుకున్నా... డీలర్ నొక్కేసిన 2.80 లక్షల డీజిల్‌కు సంబంధించి రూ.2.72 కోట్లను దోచేసినట్లుగా అధికారులు గుర్తించారు. అలాగే శనివారం చేపట్టిన తనిఖీల్లో ఆత్మకూరు మండలం సనప గ్రామం వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లోనూ ఇదే తరహా మోసం బట్టబయలైంది. ఇలాంటి మోసాలు జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల జరుగుతున్నట్లు విజిలెన్స్ అధికారులు పేర్కొంటున్నారు.

దోపిడీ ఇలా...



పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే మనం కోరిన మొత్తానికి పంప్‌బాయ్ కీ బోర్డుపై బటన్ నొక్కి మీటర్ రీడింగ్‌లో సున్నా చూపించి పెట్రోల్/డీజిల్ వేయడం పరిపాటి. అయితే మనం చెల్లించిన మొత్తానికి సరిపడ పెట్రోల్/డీజిల్ ట్యాంక్‌లో పడిందనుకుంటే ప్రస్తుత కాలంలో పొరపాటవుతోంది. డిస్పెన్సరీ యూనిట్లకు ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ చిప్‌ల వల్ల ప్రతి లీటర్‌కు 100 మిల్లీలీటర్ల పెట్రోల్/డీజిల్ తక్కువగా ట్యాంక్‌లో పడుతున్న విషయాన్ని వినియోగదారులు పసిగట్టలేకపోతుండడంతో బంక్ నిర్వాహకుల మోసాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు డిస్పెన్సరీ యూనిట్‌ను వెంటనే ఆఫ్ చేసి ఆన్ చేస్తారు. ఈ చర్యతో మెజర్‌మెంట్ యూనిట్‌లో ఎలాంటి వ్యత్యాసం కనిపించదు. అయితే యూనిట్ ఆఫ్ చేసి ఆన్ చేయడం ద్వారా అందులో ఏర్పాటు చేసిన చిప్‌లోని ఇన్‌స్టెంట్ అప్లికేషన్ ఎగిరి పోయి పాత కొలతల మేరకే ఇంధనం పంపింగ్ జరుగుతుంది. తిరిగి కొలతల హెచ్చుతగ్గుల కోసం మరోసారి ఇన్‌స్టెంట్ అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేయిస్తుంటారు.

అంతా గప్ ‘చిప్’గానే..

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. డిజిటల్ ఫిల్లింగ్ డిస్పెన్సరీ యూనిట్లలో అడిషనల్ మైక్రో చిప్స్, రిమోట్ కంట్రోల్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్, ఇన్‌స్టెంట్ అప్లికేషన్ ఇన్‌స్టాలేషన్ తదితరాలను అమర్చి గప్‘చిప్’గా ఇంధనాన్ని నొక్కేస్తున్నారు. డిస్‌ప్లేలో మీటర్ రీడింగ్ కరెక్ట్‌గానే చూపిస్తుండడంతో ఈ మోసాన్ని వినియోగదారులు పసిగట్టలేకపోతున్నారు. దీంతో చిప్ మాటున పెట్రోల్, డీజిల్ దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది. డిస్పెన్సరీ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మాజీ టెక్నీషియన్ల మేతో సంపత్తి కాస్త పెట్రోల్ బంకు యజమానులకు కాసుల వర్షం కురిపిస్తోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

పెట్రోల్ బంకులు	332
రోజువారీ పెట్రోల్ వినియోగం	4.06 లక్షల లీటర్లు
రోజువారీ డీజిల్ వినియోగం	5.65 లక్షల లీటర్లు

తనిఖీలు చేస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ టీం సభ్యులు తనిఖీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పెట్రోల్ బంకు యాజమాన్యాలపై చర్యలు తప్పవు. చిప్ ద్వారా తక్కువ కొలతలతో ఇంధనం వేస్తున్నట్లు మాకు ఫిర్యాదులు అందాయి. దీంతో తనిఖీలు ముమ్మరం చేశాం.

– నాగభూషణం, డీఎస్పీ, విజిలెన్స్, అనంతపురం

2.85 లక్షల మంది రైతులు.. రూ.57.02 కోట్లు

- నేడు పీఎం కిసాన్ నిధుల విడుదల

అనంతపురం అగ్రికల్చర్: ‘పీఎం కిసాన్’ కింద ఈ ఏడాది మూడో విడతగా సోమవారం రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం విడుదల చేయనున్నారు. ఈ ఏడాది జూన్‌లో మొదటి విడతగా రూ.2 వేలు, రెండో విడతగా అక్టోబర్‌లో రూ.2 వేలు జమ చేశారు. తాజాగా 2,85,597 మంది రైతులకు రూ.57.02 కోట్లు విడుదలవుతున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. అత్యధికంగా కళ్యాణదుర్గం మండలంలో 12,510 మందికి రూ.2.33 కోట్లు, వజ్రకరూరు- 11,674 మంది -రూ.2.33 కోట్లు, కంబదూరు-11,644 మంది- రూ.2.33 కోట్లు, విడపనకల్లు-11,191- రూ.2.24 కోట్లు, పెద్దవడుగూరు-10,707- రూ.2.14 కోట్లు, కుందుర్పి-10,642- రూ.2.143 కోట్లు, కణేకల్లు-10,280- రూ.2.06 కోట్లు, గుంతకల్లు-10,213- రూ.2.04 కోట్లు, శెట్టూరు- 10,029 మందికి రూ.2.01 కోట్లు అందనుంది. అత్యల్పంగా పెద్దపప్పూరు మండలంలో 6,166 మంది రైతులకు రూ.1.23 కోట్ల పెట్టుబడి సాయం విడుదలైనట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల పరిధిలో 42.04 లక్షల మంది రైతులకు 840.95 కోట్లు పీఎం కిసాన్ కింద సొమ్ము విడుదల చేయనున్నారు.

భక్తిశ్రద్ధలతో అతిరుద్ర మహాయజ్ఞం



అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత అతిరుద్ర మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం పదో రోజు ఉదయం వేదపండితులు వేద మంత్రాల నడుమ యజ్ఞ క్రతువులు నిర్వహించారు. సాయంత్రం యజ్ఞ క్రతువులలో భాగంగా కర్మార్చన, అష్టావధాన సేవ చేశారు. అనంతరం ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి గోదా అనంత సోమయాజీ అతిరుద్ర మహాయజ్ఞాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. తర్వాత ప్రముఖ సంగీత విద్వాంసుడు అభిషేక్ రఘురామ్ బృందం పరమేశ్వరుడిని కీర్తిస్తూ నిర్వహించిన సంగీత కచేరి అందరినీ అలరించింది.

సజావుగా గ్రూప్-2 మెయిన్స్



అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

- 88.46 శాతం అభ్యర్థుల హాజరు

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం 14 కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష సజావుగా జరిగింది. అభ్యర్థుల హాజరు 88.46 శాతం నమోదైంది. పరీక్షకు 7,293 మంది హాజరు కావాల్సి ఉండగా ఉదయం జరిగిన పేపర్-1 పరీక్షకు 6,463 మంది హాజరయ్యారు. 830 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షకు 6,441 మంది హాజరుకాగా 852 మంది గైర్హాజరయ్యారు.పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వి. వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ వేరువేరుగా సందర్శించి పరీక్షల తీరును, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును జిల్లా ఎస్పీ పి.జగదీష్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్ఎస్ షరీఫ్, సెక్షన్ ఆఫీసర్లు శంకర్‌రావు, ఆరోగ్యరాణి, నాగభవానీ పర్యవేక్షించారు.

ఏపీపీఎస్సీ తీరుపై అభ్యర్థుల ఆవేదన

ఏపీపీఎస్సీ జారీ చేసిన నోటిఫికేషన్ అసంబద్ధంగా ఉందని, రిజర్వేషన్ రోస్టర్ సక్రమంగా పాటించని కారణంగా తీవ్ర అన్యాయం జరుగుతుందని పలువురు అభ్యర్థులు వాపోయారు. రిజర్వేషన్ 70 శాతం దాటిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇక మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌కు మించి కల్పించారని, దీంతో పురుష అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అభ్యర్థుల శ్రేయస్సును, భవిష్యత్తును ఏపీపీఎస్సీ దృష్టిలో ఉంచుకుని రోస్టర్ సరిదిద్దిన తరువాతనే పరీక్ష ఫలితాలను విడుదల చేయాలని పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు.



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థిని

కేంద్రాల పరిశీలన

అనంతపురం: ఎస్ఎస్‌బీఎన్, ఆర్ట్స్, నలంద, ఎస్వీ డిగ్రీ, జేఎన్‌టీయూ (ఏ), రైవర్, అనంతలక్ష్మి, కేఎస్ఎన్ డిగ్రీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జగదీష్ పర్యవేక్షించారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేసే విధంగా చర్యలు తీసుకున్నారు.



అభ్యర్థుల తనిఖీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎస్పీ పి. జగదీష్

రోస్టర్ సరిదిద్దాలి



రిజర్వేషన్ల రోస్టర్‌ను కేటగిరీ వారీగా చూపించాల్సి ఉన్నా అలా చేయలేదు. దీంతో అభ్యర్థులకు చాలా నష్టం జరుగుతుంది. మహిళలకు అన్ని కేటగిరీల్లో కలిపి 33 శాతం రిజర్వేషన్ చూపాలి. అలా కాకుండా ఎక్కువగా చూపారు. రిజర్వేషన్ రోస్టర్‌ను సరిదిద్దకపోతే అభ్యర్థులకు అన్యాయం చేయడమే అవుతుంది.

– లక్ష్మీపతి, గ్రూప్-2 అభ్యర్థి, అనంతపురం

ఓపెన్ కేటగిరీకి చాలా నష్టం



రిజర్వేషన్ రోస్టర్‌లో తప్పులున్నాయి. ముఖ్యంగా రాయలసీమ జోన్‌లో మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ఎక్కువ పోస్టులు చూపించారు. ఈ కారణంగా ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు చాలా నష్టపోతారు. ప్రధానంగా ఓపెన్ కేటగిరీలోని పురుష అభ్యర్థులకు ఎక్కువ నష్టం కలుగుతుంది.

– సంజీవరెడ్డి, గ్రూప్-2 అభ్యర్థి, తనకల్లు

తనిఖీ తర్వాతే విద్యార్థులను అనుమతించాలి



మాట్లాడుతున్న ఆర్ఐఓ వెంకటరమణనాయక్



హాజరైన పరీక్ష నిర్వహణ అధికారులు

- ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లతో స్థానిక కొత్తూరు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణనాయక్ మాట్లాడుతూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు, ప్రతి పరీక్ష కేంద్రంలో అన్ని గదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్‌ను రోజూ గమనిస్తూ ఉండాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లను అనుమతించొద్దన్నారు. సిబ్బంది, ఇన్విజిలేటర్‌తో సహా పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతించరని స్పష్టం చేశారు. విధుల్లో ఉండే అధికారులు, ఇతర సిబ్బంది ఫొటోతో కూడిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా ధరించాలన్నారు. విద్యార్థులకు కేటాయించిన గదుల సిట్టింగ్ ప్లాన్‌ను 3-4 ప్రదేశాలలో ప్రదర్శించాలన్నారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు ఆర్. సాలాబాయి, కె.నాగరత్నమ్మ, సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమికుడు మోసం చేశాడని..

- వాస్మాయిల్ తాగిన ఇద్దరు యువతులు
- ఒకరి మృతి, మరొకరు ఆస్పత్రిలో..



మృతి చెందిన శారద



నిందితుడు దివాకర్

అనంతపురం: ఓ యువకుడు ఇద్దరు యువతులను ప్రేమించి మోసం చేశాడు. దీంతో మనస్తాపం చెందిన యువతులు వాస్మాయిల్ తాగారు. ఇందులో ఒకరు మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం గెరిశనపల్లికి చెందిన దివాకర్ అనంతపురం బళ్లారి రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గతంలో ముదిగుబ్బకు చెందిన రేష్మ అనే యువతితో ప్రేమ వ్యవహారం నడిపాడు. పెద్దలు రేష్మకు వివాహం చేయగా.. పెళ్లయిన నెలకే ఆమె తన భర్తకు విడాకులు ఇచ్చింది. మళ్లీ దివాకర్‌తో ప్రేమాయణం సాగించింది. ఈ క్రమంలో రూ.2 లక్షలకు పైగా డబ్బు ఇచ్చింది. కాగా, కణేకల్లు మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన శారద (23) అనే యువతితోనూ దివాకర్ ప్రేమాయణం సాగించాడు. అటు రేష్మ, ఇటు శారద ఇద్దరితోనూ ఏకకాలంలో ప్రేమ బంధం నడిపాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేసేవాడు. ఇటీవల శారదకు దివాకర్ తీరుపై అనుమానం వచ్చి ఇన్‌స్టాగ్రామ్‌ను పరిశీలించగా.. రేష్మతో అతడి బాగోతం బయటపడింది. ఇదే క్రమంలో రేష్మ కూడా దివాకర్‌ను నిలదీసింది. విషయం తెలుసుకున్న రేష్మ కుటుంబ సభ్యులు ఆమెను కదిరిలో ఉన్న తమ బంధువుల ఇంటికి పంపారు. అయితే, శనివారం దివాకర్‌తో మరోమారు రేష్మ ఫోన్‌లో వాగ్వాదానికి దిగింది. ఈ క్రమంలో దివాకర్ కదిరికి వెళ్లి ఆమెను బైక్‌పై అనంతపురం తీసుకొచ్చాడు. శారద ఉంటున్న హాస్టల్‌లోనే ఆమెను వదిలాడు. ఆదివారం సాయంత్రం రేష్మ, శారదలు దివాకర్‌ను తాము‌న్న చోటుకు పిలిచి ఇద్దరినీ పెళ్లిచేసుకోవాలని కోరారు. అయితే, తానెవరినీ పెళ్లి చేసుకునేది లేదంటూ దివాకర్ వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన ఇద్దరు యువతులు ఆర్టీఓ కార్యాలయం వద్దకు వెళ్లి వాస్మాయిల్ తాగారు. విషయాన్ని దివాకర్‌కు ఫోన్‌లో తెలియజేయగా.. వెంటనే అతను అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో ఇద్దరినీ ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించాడు. ఆస్పత్రిలో చికిత్స ఫలించక శారద మృతి చెందింది. రేష్మ పరిస్థితి నిలకడగా ఉంది. శారద వాస్మాయిల్ ఎక్కువ తాగిందని, రేష్మ కొంచెమే సేవించినట్లు గుర్తించిన పోలీసులు ఇందులో రేష్మ పాత్రపైనా ఆరా తీస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ప్రాణాలు బలిగొన్న మద్యం

కదిరి అర్బన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన శ్రీనివాసులు (28) మృతి చెందాడు. శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడిని శ్రీనివాసులుగా కుటుంబసభ్యులు నిర్ధారించారు. ఇటీవల మద్యానికి బానిసైన శ్రీనివాసులు శనివారం సాయంత్రం అతిగా తాగి ప్రమాదవశాత్తు విఠలరాయుని చెరువులో పడి మృతి చెందినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఘటనపై కదిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు

జింక మాంసం విక్రేత అరెస్ట్

చిలమత్తూరు: జింక మాంసం విక్రయిస్తూ హిందూపురం రూరల్ మండలం మలుగూరుకు చెందిన బాలిరెడ్డి ఆదివారం పోలీసులకు పట్టుబడ్డాడు. అందిన సమాచారంతో అప్రమత్తమైన హిందూపురం రూరల్ పోలీసులు మలుగూరు వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గ్రామ శివారున పొలాల్లో జింక తలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు.

పాముకాటుతో బాలిక మృతి


ప్రీతి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: పాముకాటుతో ఓ బాలిక మృతి చెందింది. వివరాలు... చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన కనుముక్కల రాజశేఖర్, విశాలాక్షి దంపతులకు ఓ కుమారుడు కుమార్తె ఉన్నారు. వీరి కుమార్తె ప్రీతి (8) స్థానిక తూర్పుబావులు ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. శనివారం రాత్రి ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికను పాము కాటేసింది. విషయాన్ని వెంటనే తల్లిదండ్రులకు తెలపడంతో వారు పుట్టపర్తిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఉదయం ప్రీతి మృతిచెందింది. ఒక్కాగానొక్క కుమార్తె మృతితో తల్లిదండ్రుల రోదనకు అంతులేకుండా పోయింది.

వీరముద్దప్పస్వామి ఆలయంలో చోరీ

ధర్మవరం రూరల్: చిగిచెర్ల వద్ద ముష్టూరుకు వెళ్లే రహదారిలో వెలసిన వీరముద్దప్పస్వామి, గంగమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. పూజారి పుల్లన్న తెలిపిన వివరాలు.. పూజారి రోజూ లాగే శనివారం సాయంత్రం ఆలయంలో పూజలు నిర్వహించి తాళం వేసి ఇంటికెళ్లాడు. ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లగా గేటు తెరిచి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా స్వామికి చెందిన 10 తులాల వెండి ఆభరణాలు, హుండీలోని నగదు ఎత్తుకెళ్లిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు సంక్షేమం హుష్‌కాకి



రైతు సంక్షేమంలో కొర్రీలు వేసేందుకు కూటమి సర్కారు విశ్వప్రయత్నాలు చేస్తోంది. రైతు కష్టనష్టాలను పూర్తిగా గాలికొదిలేసిన సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ ఫలాలు బాగా తగ్గించేయడానికి అనేక మార్గాలను అన్వేషిస్తోంది. తాజాగా భూఆధార్ కింద రైతులకు విశిష్ట నెంబరు ఇస్తుండగా, పీ–4 సర్వే పేరుతో పేదల నోట్లో మట్టి కొట్టేందుకు కుయుక్తులు పన్నుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- అన్నదాతల గోడు పట్టని చంద్రబాబు సర్కారు
- అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు గాలికి
- రూ.56 కోట్ల ఇన్‌పుట్, పంటల బీమా పరిహారానికి గ్రహణం
- కొర్రీలు వేయడానికి తాజాగా భూఆధార్, పీ–4 సర్వే!

అనంతపురం అగ్రికల్చర్: అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు.. పక్కా ప్రణాళికతో అన్నదాతను నిలువునా దగా చేసేసింది. గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పీఎం కిసాన్‌తో కలిపి ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద రైతు కుటుంబానికి రూ.13,500 ప్రకారం పెట్టుబడిసాయం విజయవంతంగా అమలు చేశారు. అధికారంలోకి రాగానే ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు గొప్పగా ప్రకటించడంతో రైతులు ఆశ పడ్డారు. కానీ 9 నెలలు పూర్తి కావస్తున్నా రైతును పట్టించుకున్న పాపానపోలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద ఈ ఏడాది విడతకు రూ.2 వేలు చొప్పున మూడు విడతల్లో రూ.6 వేలు జమ చేయడం సోమవారంతో పూర్తవుతుంది. కానీ చంద్రబాబు సర్కారు మాత్రం ఒక్క విడత కూడా ఇవ్వకుండా రైతుల నోట్లో మట్టి కొట్టేశారు. ఏటా రూ.20 వేల ప్రకారం తీసుకుంటే జిల్లాలో ఉన్న 2.85 లక్షల మంది రైతులకు రూ.570 కోట్లు అందాల్సి ఉంది. ఒకవేళ పీఎం కిసాన్ కింద రూ.6 వేలతో కలుపుకుంటే చంద్రబాబు సర్కారు వాటా కింద రూ.14 వేలు లెక్కేసినా రూ.399 కోట్లు రైతులకు జమ చేయాలి. కానీ, ఒక్క పైసా కూడా చూపించకుండా 2024–25 ఆర్థిక సంవత్సరాన్ని ముగించేస్తున్న పరిస్థితి నెలకొంది.

ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ లేదు..

2024 రబీ, 2025 ఖరీఫ్ కింద ప్రకటించిన 24 కరువు మండలాలకు నిబంధనల మేరకు రావాల్సిన రూ.56 కోట్లు ఇన్‌పుట్‌సబ్సిడీ (పెట్టుబడిరాయితీ) ఊసే ఎత్తడం లేదు. గతంలో ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి సీజన్ ముగిసేలోపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇన్‌పుట్‌సబ్సిడీ జమ చేసింది. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం రైతులను పూర్తిగా విస్మరించేసింది. అలాగే 2023 ఖరీఫ్‌తో పాటు 2024 ఖరీఫ్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా కింద పెద్ద మొత్తంలో రావాల్సిన బీమా పరిహారం గురించి పట్టించుకోవడం లేదు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఖరీఫ్ మొదలవగానే గత ఖరీఫ్‌కు సంబంధించి బీమా పరిహారం జమ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ ఏడాది రైతులకు ఉపయోగపడే ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. ప్రతికూల వాతావరణం, వర్షాలకు అంతో ఇంతో చేతికొచ్చిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు లేక నష్టపోతున్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కేంద్రాలు నామ్‌కే వాస్తుగా కొనసాగిస్తున్నారు. ధరల్లేక టమాట, మిరప రైతులు కుదేలయ్యారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల్లో ఒక్కరికి కూడా ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదు. 42,100 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు టార్గెట్‌లు ఇచ్చి చివరకు 18 వేల హెక్టార్లకు కుదించారు. ఉద్యాన, పాడి, పశుశాఖ, పట్టుశాఖ పథకాలకు బడ్జెట్ కేటాయింపులు నామమాత్రంగా కేటాయించడంతో వ్యవసాయ, అనుబంధ రంగాల కింద రైతులు దారుణ పరిస్థితులు అనుభవిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి పథకాల వర్తింపు బాగా తగ్గించడానికి రైతులకు యూనిక్ నెంబరు కేటాయిస్తున్నారు. నెంబరు లేదంటే వ్యవసాయ పథకాలు వర్తించవని చెబుతున్నారు. మరోపక్క పీ–4 సర్వే పేరుతో పేదలు, ప్రజల ఆదాయవనరులు గుర్తించి ఫలాలు అందకుండా కొర్రీలు వేసే కుట్రలకు కూటమి చేస్తుండటంపై అన్ని వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరయాదవ్


మాట్లాడుతున్న చంద్రశేఖరయాదవ్

అనంతపురం కార్పొరేషన్: నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరయాదవ్ అన్నారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు వారాలుగా గ్రూప్ 2 అభ్యర్థుల అభ్యంతరాలను సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వింటున్నట్లు, న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు నటించి చివరకు నట్టేటా ముంచారని మండిపడ్డారు. న్యాయం కోసం వెళ్లిన నిరుద్యోగులను పోలీసులు ఈడ్చి పారేసి, అదుపులోకి తీసుకోవడం బాధాకరమన్నారు. తక్షణం వారిని విడుదల చేయాలన్నారు. సీఎం చంద్రబాబు మొదటి నుంచి ప్రజలను మభ్యపెట్టడం తప్ప ఇచ్చిన హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన డీఎస్సీను రద్దు చేసి మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు కైలాష్ మాట్లాడుతూ.. విద్యా రంగాన్ని నిర్వీర్యం చేయడమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించకుండా పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. సమావేశంలో విద్యార్థి విభాగం నాయకులు పవన్, బాబా, నవాజ్, ఇర్షాద్, శివ, రాహుల్ రెడ్డి, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

‘ఆంగ్లం’పై పట్టు సాధించాలి


రామేశ్వర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ‘విల్2కెన్’ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ సూచించారు. డీఈఓ సహకారంతో ఈ సంస్థ జిల్లాలోని ప్రభుత్వ టీచర్లకు 40 రోజుల పాటు ఉచితంగా ఆన్‌లైన్‌లో ఆంగ్లభాష బోధన తరగతులు నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక లలితాకళా పరిషత్‌లో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 700 మంది ప్రభుత్వ టీచర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌గౌడ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థీ తెలుగులో మాట్లాడినట్టే ఇంగ్లిష్‌లోనూ మాట్లాడేలా చేయడమే శిక్షణ లక్ష్యమన్నారు. తెలంగాణలో 53 వేలమంది టీచర్లకు ఈ శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఏపీలోనూ విశాఖపట్నం, అన్నమయ్య జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. రోజూ 2,500 మంది టీచర్లు శిక్షణకు హాజరవుతున్నారన్నారు. జిల్లాలో ఈ అవకాశం కల్పించిన డీఈఓ, ఏఎంఓకు కృతజ్ఞతలు తెలిపారు. సహకారం అందించిన టీచర్లు రమణ, సరళ, శ్రీదేవి, అనురాధ, రమణారెడ్డి, నాగరాజు, వీర ఓబులు, సురేంద్రకు అభినందనలు తెలిపారు. అనంతరం రామేశ్వరగౌడ్‌ను టీచర్లు సన్మానించారు.

కుక్కల తలలు నరికివేత!

రాయదుర్గం టౌన్: మండలంలోని వేపరాళ్ల వద్ద మూడు కుక్కల తలలను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. ఆదివారం ఉదయం ఈ ఘటన వెలుగుచూసింది. విషయం తెలియగానే పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గ్రామ శివారులోని పాత లింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. కుక్కల మెడలను వేరు చేసి పక్కపక్కనే పడేశారు. కాగా, విజయనగర రాజుల 3వ రాజధానిగా ఖ్యాతిగాంచిన రాయదుర్గం ప్రాంతంలో గుప్త నిధుల కోసం దుండగులు కొన్నేళ్లుగా తవ్వకాలు సాగిస్తున్నారు. తాజాగా గుప్త నిధిని వెలికి తీసేందుకు కుక్కలను బలి ఇచ్చి ఉంటారనే అనుమానాలూ వ్యక్తమయ్యాయి. ఈ అంశానికి సంబంధించి లోతైన విచారణ చేపట్టి దుండగులను కఠినంగా శిక్షించాలని పోలీసులను గ్రామస్తులు కోరారు.

లైనింగ్ పనులతో తీరని నష్టం

- భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం
- పార్టీలకు అతీతంగా ప్రభుత్వ తీరును వ్యతిరేకించాలి
- పనులను ఐకమత్యంతో అడ్డుకుందాం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


ఓబుళంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: హంద్రీ–నీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్‌తో లైనింగ్ పనులు చేస్తే భూగర్భంలోకి జలాలు ఇంకిపోకుండా ఈ ప్రాంతంలో ఎడారి ఛాయలు అలుముకునే ప్రమాదముందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగానికి తీరని నష్టం కలిగించే ఈ పనులను అడ్డుకునేందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలకు చెందిన రైతులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సీకేపల్లి మండలం వెంకటంపల్లి, ఓబుళంపల్లి గ్రామాల్లో ఆదివారం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు, అఖిలపక్ష నేతలతో కలసి రచ్చకట్ట సమావేశాలు ఏర్పాటు చేసి, మాట్లాడారు.

గతంలో తీవ్ర వర్షాభావం కారణంగా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీరు రాక రైతులు పడిన ఇబ్బందులను గుర్తు చేశారు. బతుకు తెరువు కోసం అప్పట్లో రైతులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి కుటుంబాలను పోషించుకున్నారన్నారు. దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో హంద్రీ–నీవా కాలువ పనులకు శ్రీకారం చుట్టారని, ఆ సమయంలో కాలువలో నీటి ప్రవాహం ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు వస్తుండటంతో పంటల సాగుతో రైతులు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. అయితే ప్రస్తుతం కుప్పం ప్రాంతానికి నీటిని త్వరగా తరలించాలనే ఉద్దేశ్యంతో హంద్రీ–నీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్‌తో లైనింగ్ పనులకు ప్రభుత్వం తెరలేపిందన్నారు. సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయితే నీరు భూగర్భంలోకి ఇంకకుండా ఉమ్మడి జిల్లాలోని అనేక నియోజక వర్గాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోనే హంద్రీ –నీవా కాలువ దాదాపు వంద కిలోమీటర్ల మేర ఉందని,. కాలువకు లైనింగ్ పనులు పూర్తయితే దాదాపు 1.50లక్షల ఎకరాల రైతులకు తీరని నష్టం చేకూరుతుందన్నారు. లైనింగ్ పనుల వల్ల జరిగే నష్టాన్ని రైతులకు అర్థం అయ్యేలా వివరించి చైతన్యం తీసుకువస్తామన్నారు. ఇందుకోసం ఆత్మకూరు మండలం సింగంపల్లి నుండి కనగానపల్లి, రామగిరి మండలాల మీదుగా చెన్నేకొత్తపల్లి వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు సానే రాజారెడ్డి, మండల నాయకులు, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సంక్షేమం విస్మరించి కక్ష సాధింపు చర్యలా!


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న తలారి రంగయ్య

- వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త రంగయ్య ధ్వజం

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్రంలో ప్రజాసంక్షేమాన్ని విస్మరించి, కక్ష సాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం ఊతమిస్తోందని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య మండిపడ్డారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడడం లేదన్నారు. ఆదివారం గోళ్లలో పార్టీ మండల కన్వీనర్ గోళ్ల సూరి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర నాయకులు బోయ స్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడుతో కలసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విభేదాలు లేకుండా అందరూ కలిసి కట్టుగా పని చేస్తూ అధికార పార్టీ నాయకుల అరాచకాల నుంచి ప్రజలను కాపాడుకుందామన్నారు. సంపద సృష్టించి పేద, మధ్య తరగతి ప్రజలకు పంచుతామన్న చంద్రబాబు.. అధికారం చేపట్టిన తర్వాత కేవలం తన సామాజిక వర్గం అభివృద్ధి కోసమే పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. అధికారం చేపట్టిన 15 రోజుల్లోనే బీటీపీ పనులు ప్రారంభిస్తామని ఎన్నికల సమయంలో హామీనిచ్చిన స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సైతం ఇప్పటి వరకూ గంపెడు మట్టిని కూడా తవ్వి ఎత్తలేకపోయారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తలారి వెంకటేష్, మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, జెడ్పీటీసీలు, బొమ్మన్న, గుద్దెళ్ల నాగరాజు, పట్టణ కన్వీనర్ సుధీర్, ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీ కాంతమ్మ, నాయకులు హనుమంతురాయుడు, చంద్రశేఖర్, ఎంఎస్ రాయుడు, రేవన్న, బొమ్మన్న, తిమ్మరాయుడు, శ్రీనివాసులు, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, సత్తి, ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, చందన శివాజీ, పార్టీ అనుబంధ విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

గార్లదిన్నె: మండలంలోని కోటంకలో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాల సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 7 జతల వృషభాలను రైతులు తీసుకురాగా, పోటీలను ముఖ్యఅతిథిగా హాజరైన రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. నంద్యాల జిల్లా పీఆర్ పల్లికి చెందిన రైతు నాగయ్య వృషభాలు ప్రథమ, నాల్గో స్థానం, గార్లదిన్నెకు చెందిన రైతు రామాంజనేయులు వృషభాలు వరుసగా రెండు, మూడో స్థానాలను దక్కించుకున్నాయి. అనంతపురం నగరానికి చెందిన రైతు ఓబులపతి ఆచారి వృషభాలు ఐదో స్థానం, సోములదొడ్డికి చెందిన రైతు రామసుబ్బారెడ్డి వృషభాలు ఆరో స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యజమానులను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు.

- గార్లదిన్నె మండలం కల్లూరులో ఆదివారం సింగరప్పస్వామి తిరునాల సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో న్యూకేటగిరి వృషభాల రాతిదూలం పోటీలు పోటాపోటీగా సాగాయి. 15 జతల వృషభాలను రైతులు తీసుకురాగా, నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన రైతు కేశవరెడ్డి వృషభాలు మొదటి స్థానం, అదే జిల్లా రంగాపురం రైతు రామకృష్ణారెడ్డి వృషభాలు రెండు, నాల్గో స్థానాలు, అనంతపురం జిల్లా అక్కంపల్లి రైతు ఇంద్రారెడ్డి వృషభాలు మూడో స్థానం దక్కించుకున్నాయి. తాడిపత్రికి చెందిన రాజశేఖర్‌రెడ్డి వృషభాలు ఐదో స్థానం, నంద్యాల జిల్లా కొత్తకోటకు చెందిన కంబయ్య వృషభాలు ఆరో స్థానం, పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లి రైతు శివారెడ్డి వృషభాలు ఏడో స్థానం, తిప్పారెడ్డి పల్లి రైతు రామకృష్ణారెడ్డి వృషభాలు ఎనిమిదో స్థానం, నంద్యాల జిల్లా కొత్త బురుజుకు చెందిన తనుశ్రీ వృషభాలు తొమ్మిదో స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యజమానులను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



గుంతకల్లు: స్థానిక రైల్వే హైస్కూల్‌లో 1999–2000లో పదో తరగతి చదువుకున్న వారు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారి ఆత్మీయ పలకరింపులతో అక్కడి వాతావరణం సందడిగా మారింది. ప్రస్తుత ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావుతో పాటు నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి, ఆశీర్వాదం తీసుకున్నారు. నాటి అల్లర్లను గుర్తు చేసుంటూ సాయంత్రం వరకూ అక్కడే గడిపారు.

44 ఏళ్ల తర్వాత కలయిక



అనంతపురం ఎడ్యుకేషన్: వారంతా 1979–81లో కలసి అనంతపురంలోని కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. 44 ఏళ్ల అనంతరం తాము ఇంటర్ చదువుకున్న కళాశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. కార్యక్రమానికి ప్రస్తుత ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థులు నీలం హనుమంతరెడ్డి, పల్లె రామకృష్ణారెడ్డి, ఎం. నరసింహులునాయుడు, సి.నరసింహారెడ్డి, అబ్బా శ్రీరాములు, సుధాకర్, పయ్యావుల రాధాకృష్ణ, బాల సత్యనారాయణ, నీలం గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఒకరినొకరు ఆనందంగా ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం గురువులను సన్మానించారు.

క్లుప్తంగా

కథల్లో క్లుప్తత ముఖ్యం



సింగమనేని నారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు

అనంతపురం కల్చరల్: స్థానిక లలిత కళాపరిషత్తు వేదికగా ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఔత్సాహిక రచయితలు కథల ఆవిష్కరణలో తీసుకోవాల్సిన మెలకువలపై 'అనంత కథా కార్యశాల' నిర్వహించారు. డాక్టర్ అంకె శ్రీనివాస్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ.. దైనందిన జీవితాల్లోని సంఘటనలను కథా వస్తువులుగా మార్చుకుని కథనంగా మార్చడానికి తగిన కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి పేరుతో విధ్వంసాలు విపరీతంగా సాగుతున్నాయని.. ఆర్థిక దోపిడీపై కూడా మంచి కథలు రావాలని ఆకాంక్షించారు. కథకు ఉండాల్సిన ప్రాథమిక అవగాహన తదితర విషయాలపై డాక్టర్ వేంపల్లి షరీఫ్ చక్కగా వివరించారు. కథ ఆరంభం ఆసక్తి కల్గించేలా ఉండాలని.. ముఖ్యంగా క్లుప్తతను పాటిస్తూ చక్కటి ముగింపుతో సాగే కథలు ఆకట్టుకుంటాయని తెలిపారు. 'మంచి కథ ఎలా తయారవుతుంది' అనే అంశంపై రచయిత్రి శశికళ, సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ ప్రగతి, కథా రచయిత శ్రీనివాసమూర్తి మాట్లాడారు. అంతకుముందు రచయిత సింగమనేని నారాయణకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి సభ్యులు సురేష్, రవిచంద్ర, ఉప్పరపాటి వెంకటేశులు, రాయుడు, రాజారామ్, లక్ష్మీ శ్యామ్, దర్శకుడు రషీద్‌బాషా, జీఎల్ఎన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించాలని వినతి



పరిటాల సునీతకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

రాప్తాడురూరల్: అక్కంపల్లి పంచాయతీ పరిధిలోని ఐదుకల్లు సదాశివన్ కాలనీకి వచ్చేందుకు ఉన్న కల్వర్ట్ పూర్తిగా దెబ్బతింది. కొత్తగా కల్వర్టు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు, కాలనీవాసులు కోరారు. ఆదివారం సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు అక్కంపల్లి పంచాయతీకి వచ్చిన ఎమ్మెల్యే పరిటాల సునీతను కాలనీవాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తాత్కాలికంగా నిర్మించుకున్న కల్వర్టు వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయిందన్నారు. అలాగే కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. రేషన్ బియ్యం కూడా కాలనీలోనే ఇచ్చేలా చూడాలన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇంటి పట్టాలు మంజూరు చేసి పక్కా గృహాల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దుర్గాప్రసాద్, రెడ్డప్ప, మహేంద్ర, నాగభూషణ, బాషా, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డు తరలించాలి



కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కార్పొరేషన్: కంపోస్టు యార్డును తరలించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులు కంపోస్టు యార్డును పరిశీలించారు. కంపోస్టులో రోజు రోజుకు టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోతోందన్నారు. మంటలు చెలరేగినప్పుడు వచ్చే పొగతో చుట్టు పక్కల ప్రాంతాలైన రాజీవ్ కాలనీ, ఏ.నారాయణపురం పంచాయతీ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎన్‌హెచ్-44 రోడ్డుపైన రోజూ వేల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయని గుర్తు చేశారు. వేకువజామున వచ్చే పొగతో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదన్నారు. కంపోస్టు తరలించే వరకు చెత్త నిర్వహణ చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎన్నికలకు ముందు కంపోస్టును తరలిస్తామని చెప్పారని.. ఇప్పటి వరకు ఆ విషయాన్ని పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నల్లప్ప, రామిరెడ్డి, వెంకటనారాయణ, ముర్తుజ, బాలకృష్ణ, వెంకటేశు, ఇస్మాయిల్, వెంకట, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడవ రోడ్డు గొంగడి రామప్ప కల్యాణ మండపంలో మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశామని శ్రీఅనంత శివారాధన సమితి గౌరవాధ్యక్షుడు పాలసముద్రం నాగరాజు తెలిపారు. సమితి ఆధ్వర్యంలో ఈనెల 26 రాత్రి నుంచి 27 ఉదయం వరకు సాగే శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 26న ఉదయం 11 గంటల నుంచి భజన, సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరుగుతాయి. సీనియర్ గాయనీగాయకులు శివరాత్రి మహత్యం తెలిపే భక్తిగీతాలను ఆలపిస్తారని పేర్కొన్నారు. రాత్రి 10 గంటల నుంచి రచయిత్రి వరలక్ష్మి శివుడి అనుగ్రహం పొందడం ఎలా ? అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు. అలాగే నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం ఆధ్వర్యంలో శాస్త్రీయ, జానపద నాట్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. నిర్వాహకులు ఉడుపి అనంత పద్మనాభ, కేవీఎస్ చలపతిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మీధరరావు, మురగన్, చక్రపాణి, యాదవల్లి సుబ్రహ్మణ్యం, భగవాన్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శఠగోపం

సార్వత్రిక ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే వరకూ నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. తీరా గద్దెనెక్కి నెలలు గడుస్తున్నా.. ఆ హామీ అమలుపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నిరుద్యోగులకు భృతి అందించే ప్రతిపాదనే ప్రభుత్వం వద్ద లేదని ఇటీవల జరిగిన అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం రాత పూర్వకంగా తేల్చి చెప్పేసింది. రాష్ట్రంలో 4.46 లక్షల మంది మాత్రమే నిరుద్యోగులు ఉన్నట్లు కాకి లెక్కలు చూపిస్తోంది. రాప్తాడు నియోజకవర్గంలో దాదాపుగా 30 వేల మంది నిరుద్యోగులు ఉన్నట్లు అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. చంద్రబాబు హామీలను నమ్మిన నిరుద్యోగులకు మరోసారి నిరాశ మిగిలింది.



ఎన్నికలకు ముందు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఊదరగొట్టిన చంద్రబాబు

- అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు పంగనామం
- నిరుద్యోగ భృతి ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- 2014లో ఇదే తరహా మోసం
- ఆందోళనలో నిరుద్యోగులు

రాప్తాడు: ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు మూడు కూటమిగా ఏర్పడి చాలా హామీలు గుప్పించారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయడం లేదు. ఇక జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై గంపెడు ఆశలు పెట్టుకున్న యువతకు చంద్రబాబు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. ప్రమాణ స్వీకారం రోజున మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారు. కూటమి సర్కార్ ఇప్పటి వరకు డీఎస్సీ నిర్వహించకుండా కాలయాపన చేస్తోంది. నియోజకవర్గంలో దాదాపుగా 10 వేల మందికి పైగా బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. తొలి సంతకాన్ని నమ్మి అభ్యర్థులు హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు, వైఎస్సార్ తదితర జిల్లాల్లో కోచింగ్ తీసుకుంటున్నారు. ఇందుకు వేలాది రూపాయలు ఖర్చవుతుండటంతో కొందరు అప్పులు చేశారు. అయితే ప్రభుత్వం టెట్‌తో సరిపెట్టి ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా వాయిదాల మీద వాయిదా వేస్తుండటంతో అభ్యర్థులు దిగాలు చెందుతున్నారు. ఇతర ఉద్యోగాల భర్తీకి సంబంధించి కూడా ఇప్పటి వరకు సర్కార్ స్పష్టమైన ప్రకటన చేయలేదు. కనీసం ఎన్నికల హామీ మేరకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఇంటికో ఉద్యోగం ఎక్కడ బాబూ..

2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 600కు పైగా హామీలిచ్చి గద్దెనెక్కారు. ఒక్క హామీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను దగా చేశారు. నిరుద్యోగంపై ఒక అడుగు ముందుకేసి జాబు కావాలంటే బాబు రావాలి.. ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని కపట ప్రేమ ప్రదర్శించారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు యువనేస్తం పేరుతో ముందుకొచ్చారు. నియోజకవర్గంలో వేలాది మంది నిరుద్యోగులు ఉంటే వివిధ నిబంధనలతో కొందరికి మాత్రమే రూ.1000 చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించి చేతులు దులుపుకున్నారు. 2019 ఎన్నికల్లో యువతీ, యువకులు టీడీపీకి గుణపాఠం చెప్పారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారు. 2024లో ఎన్నికల వేళ అధికారం కోసం మరోసారి నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు చొప్పున భృతి చెల్లిస్తామని హామీలు గుప్పించారు. నిరుద్యోగుల ఓట్లు దండుకున్నారు. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ భృతి గురించి ఊసెత్తడం లేదు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి



ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలి. జిల్లాలో లక్షలాది మంది చదువుకుని ఉద్యోగాలు లేక వ్యవసాయ, ఉపాధి పనులకు వెళ్తున్నారు. ప్రభుత్వం అప్పుల్లో ఉంది.. హామీలు అమలు చేయలేం అని చెప్పడం సిగ్గుచేటు.

– బుడగ జయంత్, గంగలకుంట

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



నేను బీటెక్ పూర్తి చేశాను. ప్రస్తుతం ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. ఇంటికో ఉద్యోగం లేదా నెలనెలా నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. కనీసం ఇస్తారో లేదో చెప్పడం లేదు. చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలు అని అర్థం అవుతోంది. జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉంది.

– బోయ కిరణ్ కుమార్, బొమ్మేపర్తి

మోసం చేయడం చంద్రబాబు నైజం



నేను డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం రాకపోవడంతో ఇంటి దగ్గరే ఉంటున్నాను. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు దాటుతున్నా నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. కూటమి పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో చదువుతున్న ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. యువకులు నమ్మి చంద్రబాబుకు ఓటు వేశారు. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ భృతిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరం.

– నరసింహా రెడ్డి, చిన్మయనగర్

సర్పరూపుడికి పంచామృతాభిషేకాలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాఘమాసం చివరి ఆదివారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ హోమాలు చేశారు. స్వామి వారి స్వర్ణ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. అలాగే ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని రాప్తాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరుతల నాగేంద్రకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి భరోసా ఇచ్చారు. వారం రోజుల క్రితం చిరుతల నాగేంద్ర గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటినా వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స అనంతరం ఆదివారం ఉదయం రాప్తాడుకు చేరుకున్నాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదివారం రాప్తాడుకు వెళ్లారు. చిరుతల నాగేంద్రను పరామర్శించాడు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు చింతకాయల జయన్న, సాకే చంద్ర పాల్గొన్నారు.

'ఎన్‌ఆర్‌ఐ' అమెరికన్ ప్రీ స్కూల్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న 'ఎన్‌ఆర్‌ఐ' యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్‌ఆర్‌ఐ విద్యా సంస్థల ఆధ్వర్యంలో స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎన్‌ఆర్‌ఐ అమెరికన్ ప్రీ స్కూల్'ను ఆదివారం విద్యా సంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డి, ఎండీ వెన్నపూస చంటిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ దివ్యారెడ్డి ప్రారంభించారు. చైర్మన్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాల విజయవంతంగా నడుస్తోందన్నారు. అదేస్థాయి ఉత్సాహంతో అత్యున్నత ప్రమాణాలతో ప్రీ స్కూల్ ఏసీ క్యాంపస్‌ను ప్రారంభించామన్నారు. ఇందులో ప్రీ-కేజీ, ఎల్‌కేజీ, యుకేజీ, డే-కేర్ సర్వీసెస్ ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఫౌండర్ వెన్నపూస సురేష్‌రెడ్డి, డైరెక్టర్ అనూషరెడ్డి, వెంకటేష్, నవీనా రెడ్డి, శైలజ, వనజ, ఏట వెంకటేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సాదిక్‌వలి

అనంతపురం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామని పార్టీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సాదిక్‌వలి అన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో సాదిక్‌వలికి చోటు లభించడంతో ఆదివారం రుద్రంపేట పంచాయతీ పరిధిలోని వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సాదిక్‌వలి మాట్లాడుతూ.. పేదల పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ప్రజలను నిలువునా మోసం చేశారన్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రుద్రంపేట ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకటరాముడు, ఖాజా, మహబూబ్ బాషా, ముస్తఫా, రామ్మూర్తి, వెంకటేష్, బాలయ్య, నాగరాజు, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహాశివుడి ఉత్సవాలు



విద్యుత్ వెలుగుల్లో కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం



స్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం వేదికగా మహాశివుడి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఉదయం ఆలయంలో దీక్షా హోమాలు, మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు జరిగాయి. స్వామివారు సతీసమేతుడై రావణబ్రహ్మ వాహనంపై నగరవీధుల్లో ఊరేగి దర్శనమిచ్చాడు. సాయంత్రం నాట్యాచార్యులు నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం కూచిపూడి నాట్యాలతో శివపార్వతులకు నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌బాబు భక్తబృందం నరేంద్రచౌదరి, ఎర్రిస్వామి, శ్రీనివాసులు , పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అక్క దేవతల జాతర



కొలువుదీరిన అక్క దేవతల విగ్రహాలు



కోర్కెల ఊయలను ఊపుతున్న భక్తులు

రాప్తాడురూరల్: రాచానపల్లిలో రెండు రోజుల పాటు జరిగిన అక్క దేవతల జాతర ఆదివారం రాత్రి ముగిసింది. తొలిరోజు శనివారం రాత్రి గొటుకూరు, కందుకూరు, రాచానపల్లి గ్రామాల నుంచి పన్నారపు గంపలు అమ్మవారి గుడికి చేరాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు గుడివద్ద అక్క దేవతల విగ్రహాలను కొలువుదీర్చారు. రాచానపల్లి, అక్కంపల్లి, కొడిమి, సిండికేట్‌నగర్, గొటుకూరు, కందుకూరు, అనంతపురం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేలాదిమంది రావడంతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. రూరల్ పీఎస్ ఎస్ఐ కొమ్మినేని రాంబాబు పర్యవేక్షణలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటను జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

బండా అంజి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ..

గతే ఏడాదిలాగా ఈసారి కూడా రాచానపల్లి సర్పంచ్ బండా అంజి యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మజ్జిగ పంపిణీ చేశారు. తనతండ్రి ఓబన్న జ్ఞాపకార్థం భక్తులకు మజ్జిగ పంపిణీ చేసినట్లు సర్పంచ్ వెల్లడించారు.

భక్త జనసంద్రమైన కోటంక



స్వామి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు రామాచార్యులు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో ఉన్న గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రం భక్త జన సంద్రమైంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో ఆదివారం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.ఈసందర్భంగా ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామికి అభిషేకాలు,అర్చనలు తదితర విశేష పూజలు చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని 108 సాలగ్రామ శివలింగాలకు భక్తులు పూజలు చేశారు. అలాగే ఏకశిల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం వద్ద భక్తులు సందడి చేశారు. అదేవిధంగా భాస్కర్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, గాండ్ల విజయ భాస్కర్, విశాలక్షి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దళితులపై దాడులు అరికట్టాలి

అనంతపురం టవర్‌క్లాక్: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దళిత, గిరిజనులపై దాడులు పెరిగాయి. దాడులను వెంటనే అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లన్న మాట్లాడుతూ.. భూ వివాదంలో కూడేరు మండలం కదరకుంట గ్రామానికి చెందిన దళితులు ఆదిలక్ష్మి, రామచంద్ర, పెద్దన్న, పోలప్ప, రమాదేవి, రమేష్‌పై కురుబ కులానికి చెందిన వారు దాడి చేయడం దారుణమన్నారు. తాకట్టు పెట్టిన భూమిని ఇవ్వాలని కోరిన దళితులను కొట్టడం సరికాదన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించు కోలేదన్నారు. కార్యక్రమంలో కేపీ నారాయణ స్వామి, చిరంజీవి, చిన్న పెద్దన్న, నాగేష్, హనుమంతు, పక్కీరప్ప, పోలా వీరాంజనేయులు, శీన, కిష్టప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దండి

కనగానపల్లి: గ్రామాల్లో క్రమం తప్పకుండా ఇంటింటా చెత్త సేకరణ చేపట్టి.. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని డీఎల్‌పీఓ శాంతకుమారి తెలిపారు. ఆదివారం మండలంలోని దాదులూరు గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణను పరిశీలించారు. స్థానిక పంచాయతీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులతో కలసి ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తను పారవేయకూడదని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరిస్తారని వెల్లడించారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు, స్థానిక ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

'దోపిడీకి వ్యతిరేకంగా పోరాడదాం'

అనంతపురం సిటీ: దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ తెలిపారు. ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో రాజ్యం విప్లవం పుస్తకంపై సదస్సు నిర్వహించారు. ఆ పార్టీ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో ఆదివారం 1978 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. 46 ఏళ్ల తర్వాత దాదాపు 100 మంది విద్యార్థులు ఒకచోట కలుసుకోవడంతో సందడి వాతావరణం నెకలొంది. పాఠశాల రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఒకరినొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి గురుభక్తి చాటుకున్నారు.